క్లుప్తంగా

తగ్గుతున్న వరద ప్రవాహం



తిమ్మందొడ్డి వద్ద తుంగభద్ర నదిలో వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

సి.బెళగల్: మండలంలో ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో వరద ప్రవాహం సోమవారం కాస్త తగ్గుముఖం పట్టిందని అధికారులు తెలిపారు. మూడు రోజులుగా ఎగువ నుంచి విడుదలైన వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మండల అధికారులు నదీతీర గ్రామాల్లో పర్యటించి జాగ్రత్తగా ఉండాలంటూ ప్రజలను అప్రమత్తం చేశారు. సోమవారం తిమ్మందొడ్డి గ్రామంలో వీఆర్వో శ్రీనివాసులు, వీఆర్ఏలతో కలిసి నదిలో నీటి ప్రవాహాని పరిశీలించారు. అలాగే ముడుమాల వీఆర్వో అక్బర్ తదితరులు నది ప్రవాహ వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓ శకుంతల వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

సి.బెళగల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ మండల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ విద్యారంగ సంస్కరణలతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులలో విశ్వాసం సన్నగిల్లుతోందని, పరిస్థితి విషమించకముందే ప్రభుత్వం సర్వత్రమే చర్యలు తీసుకోవాలన్నారు. యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు తిమ్మన్న, కిశోర్‌కుమార్, హనుమంతు, మండల అధ్యక్షుడు అనుమన్న, ప్రధాన కార్యదర్శి మనోజ్ ఉన్నారు.

పరిశుభ్రతతో రోగాలు దూరం



ముడుమాలలో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: గ్రామాల్లోని ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. సోమవారం మండలంలోని బురాన్‌దొడ్డి, ముడుమాల గ్రామాల్లో సర్పంచ్‌లు చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని ప్రధాన వీధులలో చెత్తా చెదారం తొలగింపుతో పాటు, మురికి కాలువలలో పూడికతీత పనులను పారిశుద్ధ్య కార్మికులతో చేయించారు. అలాగే ఆయా గ్రామాల ప్రజలకు పరిశుభ్రత, అంటువ్యాధుల వ్యాప్తి, నివారణ, మంచినీటి వినియోగంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్ శ్రీరాములు ఉన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



పాణ్యంలో నిలిచిపోయిన సూపర్‌లగ్జరీ బస్సు

పాణ్యం: నంద్యాల డిపోకు చెందిన సూపర్ లగ్జరీ ఆర్టీసు బస్సు పాణ్యం బస్టాండ్‌లో మొరాయించింది. నంద్యాల నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా సోమవారం ఉదయం.6.30 గంటల సమయంలో పాణ్యం బస్టాండ్‌లో నిలిచిపోయింది. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అర్ధ గంట తర్వాత అధికారులు మరో బస్సును పంపించి ప్రయాణికులను తరలించారు.

పకడ్బందీగా పింఛన్ల పంపిణీ



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రమణ

కల్లూరు: ఆగస్టు నెల పింఛన్ల పంపిణీ మొదటి రోజునే 100శాతం పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి (సెట్కూరు సీఈఓ) రమణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎవైనా సాంకేతిక సమస్యలు ఉంటే ముందుగానే పరిష్కరించుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, తాగునీరు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఈఓఆర్డీ రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

‘గులాబీ’ నివారణకు ముందస్తు చర్యలు!

- క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించేలా ప్రణాళికలు
- ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ముందు జాగ్రత్తలపై అవగాహన
- పురుగు ఉనికిని గుర్తించడంపై ప్రత్యేక దృష్టి



పత్తి పంటలో రైతులతో కలిసి గులాబీ రంగు పురుగును గుర్తిస్తున్న ఏడీఏ సాలురెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్రంలో పత్తి అత్యధికంగా సాగవుతున్న కర్నూలు జిల్లాలోనే. అయితే పంటకు గులాబీ రంగు పురుగు ప్రధాన సమస్యగా మారింది. పురుగు తీవ్రత సాధారణంగా సెప్టెంబరు, అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎక్కువగా ఉంటుంది. బెట్ట సమయాల్లో ఈ పురుగు ప్రభావం మరింత పెరుగుతుంది. వ్యవసాయ శాఖ ఈ ఏడాది ముందస్తు జాగ్రత్తల ద్వారా గులాబీ రంగు పురుగు బెడద తగ్గించడంపై దృష్టి సారించింది. రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, ఏఈఓలు, మండల వ్యవసాయ అధికారులు, ఏడీఏలు క్షేత్రస్థాయికి వెళ్లి పురుగుల ఉనికిని గుర్తించడమెలా? కనిపిస్తే నివారణ మార్గాలపై రైతులకు అవగాహన కల్పించేలా, పత్తి సాగు చేసిన అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టే విధంగా జిల్లా వ్యవసాయ యంత్రాంగం ప్రణాళికను రూపొందించింది. గులాబీ రంగు పురుగు అతి సూక్ష్మంగా ఉంటుంది. ఇది పత్తి కాయలకు కంటికి కనిపించని విధంగా సూది మొనంత రంధ్రం వేసి లోపలికి వెళ్లి గుజ్జును పీల్చివేస్తాయి. అలాగే పూలలోకి చేరి పత్ర హరితాన్ని పీల్చి వేస్తాయి. దీంతో ఇవి గుడ్డి పూలుగా మారుతాయి. గులాబీ రంగు పురుగు పత్తి వినాశకారిగా మారింది. పురుగు ఉనికి, నివారణ చర్యలను వ్యవసాయ శాఖ కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి వివరించారు.

పురుగు ఉనికిని ఇలా గుర్తించాలి..

ప్రస్తుతం పత్తి పూత, కాయ దశలో ఉంది. పురుగు ఉనికిని గుర్తించేందుకు మూడు పద్ధతులు పాటించాలి. పత్తి పంటలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. వీటిలోంచి ఆడపురుగు వాసన వస్తుంది. దీంతో మగ పురుగులు ఈ బుట్టలోకి వచ్చి పడతాయి. మూడు రోజుల్లో రోజుకు 8 పురుగులు ప్రకారం కనిపిస్తే గులాబీరంగు పురుగు ఆర్థిక నష్టపరిమితిని దాటిపోయినట్లుగా భావించాలి. తగిన జాగ్రత్తలు తప్పనిసరి. అలాగే.. గుడ్డిపూలను కూడా గమనించాలి. ఇక.. ర్యాండమ్‌గా 20 పత్తి కాయలు పెరికి పరిశీలించాలి. కాయ తొలిచి ఉంటే పురుగు ఉనికి ఉన్నట్లే. వెంటనే ముందస్తు చర్యలు తీసుకోవాలి.

ముందు జాగ్రత్త చర్యలు...

గులాబీ రంగు పురుగు ఉనికిని గుర్తించిన తర్వాత తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలి. వేప నూనె, వేప కాషాయం ద్వారా ఆడపురుగులు గుడ్లు పెట్టకుండా నిరోధించవచ్చు. వేప నూనె 5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా వేప కషాయం 5 శాతం ప్రకారం పిచికారీ చేయాలి. దీంతో పాటు ప్రొఫెనోఫాస్ (క్యూలేక్రాన్) ఎకరాకు 400 ఎంఎల్ 200 లీటర్ల నీటికి కలిపి స్ప్రే చేయించాలి.

ఎస్సార్బీసీకి నీటి విడుదల

పాణ్యం: ఎస్సార్బీసీ ఆయకట్టు రైతులకు సాగు నీటిని అందిస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా అన్నారు. సోమవారం గోరుకల్లు జలాశయం వద్ద బైపాస్‌కు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి ప్రస్తుతం 6వేల క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. 1500 క్యూసెక్కుల నీరు బైపాస్‌కు విడుదల చేయగా మిలిగిన నీటిని గోరుకల్లు జలాశయంలో నిల్వ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు సాగునీటిని వృథా చేయకుండా వాడుకోవాలన్నారు. ఈఈ సుభకుమార్, డీఈఈ క్రిష్ణన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): వచ్చే నెల 4, 5 తేదీల్లో విజయవాడలోని ఇందిరాగాంధీ మెమోరియల్ స్టేడియంలో నిర్వహించనున్న అంతర్ జిల్లాల సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ చాటాలని కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి సూచించారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన పంచలింగాల కేజీబీవీ పాఠశాలకు చెందిన అనూష, ఉదయలక్ష్మీ, దీపిక, స్రవంతి, మమతలను సోమవారం తన కార్యాలయంలో ఎమ్మెల్యే అభినందించారు. సాఫ్ట్ టెన్నిస్ రాష్ట్ర సహాయక కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షా సప్తాహ్



బ్యాతోలిలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయుడు



పోలకల్ రెగ్యులర్ పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న హెచ్‌ఎం రేవల శ్రీనివాసులు

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 22 నుంచి నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారం ముగిసిందని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్న నూతన జాతీయ విద్యా విధానాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం 22 నుంచి ఈనెల 29వ తేదీ వరకు పాఠశాలలో రోజూ వారి కార్యక్రమాలను రూపొందించిందన్నారు. చివరి రోజు సోమవారం శుభ్ దిన్ భోజన్ కార్యక్రమం చేపట్టగా, పోలకల్ రెగ్యులర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రేవుల శ్రీనివాసులు టీచర్లతో కలిసి విద్యార్థులకు ప్రత్యేక వంటకాలను వడ్డించారు. బ్యాతోలిలో హెచ్‌ఎం సోమశేఖర్ విద్యార్థులకు అరటిపళ్లను పంపిణీ చేశారు. పలుకుదొడ్డిలో హెచ్‌ఎం హనుమంతు, సి.బెళగల్ రెగ్యులర్, కోటారుమిట్ట, పోలకల్ స్పెషల్ హెచ్‌ఎంలు కిషోర్‌కుమార్, అనుమన్న, తిమ్మన్న ప్రత్యేక వంటలను విద్యార్థులకు అందజేశారు.

నేడు ఉపాధ్యాయులకు శిక్షణ

సి.బెళగల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు విద్యార్థులకు చేపట్టాల్సిన కంటి పరీక్షల నిర్వహణపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని ఎంఈఓ ఆదాం బాషా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఉదయం పది గంటల నుంచి ఉపాధ్యాయులకు విద్యార్థుల కంటి స్క్రీనింగ్ పరీక్షపై శిక్షణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. మండలంలోని ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మోడల్, కస్తూర్బా, గురుకుల పాఠశాలల నుంచి పీఈటీ లేదా సీనియర్ ఉపాధ్యాయులు లేదా హెచ్‌ఎంలు శిక్షణకు తప్పకుండా హాజరవ్వాలని సూచించారు.

హెచ్‌ఎంపై దాడి హేయమైన చర్య

పాణ్యం: బలపనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డేగ నారాయణపై దాడి చేసిన వారిని శిక్షించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామఫక్కీరరెడ్డి, కార్యదర్శి భాస్కరరెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై దాడులు సరికాదన్నారు. విద్యార్థి తండ్రే ఇలాంటి ఘటనలకు పాల్పడడం క్షమించరాని నేరమన్నారు. పోలీసు, అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి బాధ్యులను శిక్షించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పీఆర్‌టీయూ తరుపున ఎమ్మెల్యే గౌరు చరితకు వినతిపత్రం అందజేశారు. మాధవరెడ్డి, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. గ్రామానికి చెందిన హరీష్, పవన్, మేకల రవికుమార్ మరికొందరితో కలిసి నాలుగు రోజుల క్రితం వెల్దుర్తి మండలం, కలుగొట్ల గ్రామంలో జరిగిన మొహర్రం వేడుకలను తిలకించేందుకు వెళ్లారు. అక్కడ అందరూ కలిసి మద్యం సేవించారు. ఈ క్రమంలో మాటమాట పెరిగి మేకల రవిపై హరీష్ దాడి చేశాడు. స్థానికులు కల్పించుకుని ఇరువురికి సర్దిచెప్పి పంపారు. ఆ తర్వాత మేకల రవి వర్గీయులు కలుగొట్ల గ్రామ శివారులో కాపుకాసి హరీష్‌పై దాడిచేశారు. ఇది మనసులో పెట్టుకుని ఆదివారం ఇరువర్గాల వారు పరస్పర దాడులకు దిగారు. దాడిలో ఇద్దరు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని గాయపడిన వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

రేపు సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 31న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జూనియర్ సాఫ్ట్‌బాల్ పురుషులు, మహిళల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి విజయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2007 జనవరి 1 తర్వాత జన్మించిన క్రీడాకారులు అర్హులని, ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 17 నుంచి 19వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లాలో జరగనున్న 11 వ జూనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 70320 88008 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

భూ సమస్యను పరిష్కరించండి



భూ సమస్యపై తహసీల్దార్ అనుపమతో మాట్లాడుతున్న పోలకల్ వాసులు



మండల పరిషత్ కార్యాలయంలో మరికొందరు అధికారులు

సి.బెళగల్: భూ సమస్యను పరిష్కరించాలని మండలంలోని పోలకల్ గ్రామానికి చెందిన కోకిల కేశమ్మ, కుటుంబ సభ్యులు తహసీల్దార్ అనుమను కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కొందరు మండల అధికారులతో కలిసి తహసీల్దార్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. పోలకల్ కోకిల కేశమ్మ, వారి కుటుంబ సభ్యులు, బ్రాహ్మణదొడ్డి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 241/1లోని 3.20 ఎకరాల భూమి తమ పేరుమీద ఉండగా, ఆ భూమి తమకు చెందుతుందంటూ దాయాదులు రికార్డుల మార్పునకు ప్రయత్నిస్తున్నారని, విచారించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. అలాగే వివిధ గ్రామాలకు చెందిన రైతులు, తమ భూ సమస్యలను పరిష్కరించాలని, ప్రజలు తమకు సౌకర్యాలను, వసతులు కల్పించాలని మండల అధికారులకు అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏంఈఓ ఆదాంబాషా, ఏపీఓ వెంకటస్వామి, హౌసింగ్ ఏఈ సుమంత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, సెరీకల్చర్ అధికారిణి పద్మావతి, ఏఈఓ సిద్ధు ఉన్నారు.

అధికారులు ఎవరికి వారే..

సోమవారం తహసీల్దార్ అనుపమ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి కొంతమంది అధికారులే హాజరవగా, మరికొందరు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీసీ ఏర్పాటు చేసుకుని అక్కడే ఉండిపోయారు. ఎంపీడీఓ శకుంతల, ఈఓఆర్డీ సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ మండల పరిషత్ కార్యక్రమంలో ఉండగా, కొద్దిసేపు తరువాత తహసీల్దార్ కార్యాలయంలోని కార్యక్రమానికి హాజరైన హౌసింగ్ ఏఈ సుమంత్ సైతం మండల పరిషత్ కార్యాలయం వెళ్లిపోయారు. కొంతమంది తహసీల్దార్ కార్యాలయంకు, మరికొందరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే కార్యక్రమాలకు హాజరయ్యారు. సమస్యలను తెలుపుకునేందుకు మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు అవస్థలు పడ్డారు. ఒకచోట ఆ అధికారులు ఇక్కడలేరని, మరోచోట ఉన్నారని అనడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల అధికారులంతా మొత్తం ఒకే చోట కార్యక్రమం నిర్వహిస్తే సమస్యలు చెప్పుకోవడానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని పలువురు పేర్కొన్నారు.

కోడుమూరులో పెట్రేగిపోయిన దొంగలు



కోడుమూరులో దుకాణం రేకును కట్ చేసిన దొంగలు



దొంగతనంపై మెడికల్ షాపులో విచారణ చేస్తున్న పోలీసులు

కోడుమూరు రూరల్: పట్టణంలో దొంగలు చెలరేగిపోయారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆర్‌టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న మానస మెడికల్ స్టోర్ షట్టర్‌ను ఎత్తి షాపులోని చిల్లర డబ్బులను ఎత్తుకెళ్లారు. అలాగే తహసీల్దార్ కార్యాలయ సమీపంలో రెండు టీ దుకాణాల రేకులను కట్ చేసి వాటిల్లోని చిల్లర, సిగరెట్ ప్యాకెట్‌లను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయాన్నే దుకాణాలను తెరిచేందుకు వచ్చిన యజమానులు రేకులు కట్ చేసి ఉండడం, షట్టర్ ఎత్తి ఉండడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించడంతో పాటు, సమీపంలోని సీసీ కెమెరాల్లో దొంగల ఆనవాళ్ల కోసం ఆరా తీశారు.

పెట్రేగిపోతున్న చిల్లర దొంగలు,పోకిరీలు..

పట్టణంలో ఇటీవల కాలంలో చిల్లర దొంగలు, పోకిరీలు పెట్రేగిపోతున్నారు. ఇళ్ల ముందు పెట్టిన ఇనుప వస్తువులు, సైకిళ్ల వంటి వాటిని ఎత్తుకెళ్లిపోతుండగా, పోకిరీలు ద్విచక్రవాహనాలను ధ్వంసం చేయడం వంటి పనులకు పాల్పడుతున్నారు. చిన్న చిన్న దొంగతనాలే అవుతుండడంతో ప్రజలు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇకనైనా పోలీస్ అధికారులు స్పందించి పట్టణంలో చోరీలకు పాల్పడుతున్న దొంగలను గుర్తించి అరెస్ట్ చేయడంతో పాటు, అల్లర్లకు పాల్పడే పోకిరీలపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జెడ్పీటీసీ పొలంలో డ్రిప్పులకు నిప్పు

- పోలీసులకు ఫిర్యాదు





జెడ్పీటీసీ పొలంలో కాలిపోయిన డ్రిప్పు పైపులు, వ్యవసాయ పనిముట్లు

గడివేముల: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులు, మద్దతుదారులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది. గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి పొలంలో ఉన్న డ్రిప్పు పైపులతో పాటు పొలం వద్ద గదిలోని వ్యవసాయ పనిముట్లకు సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దాదాపు రూ.1.50 లక్షల వ్యవసాయ పనిముట్లు కాలిబూడిదయ్యాయి. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో జెడ్పీటీసీ సభ్యుడు అనుమానితులపై ఫిర్యాదు చేశారు.

ఆస్తుల ధ్వంసం సమంజసం కాదు

కూటిమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండలంలో టీడీపీ నాయకుల ఆరాచకాలు శృతి మించిపోయాయని మండిపడ్డారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి దాడులకు పాల్పడలేదన్నారు. గతంలో ఎన్నడూ గ్రామంలో ఇలాంటి ఘటనలు జరగలేదన్నారు. రాజకీయంగా ఎదుర్కోవాలే గాని ఆస్తుల ధ్వంసం చేయడం తగదన్నారు. ఈనెల 2వ తేదీ ఒండుట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రవీంద్రారెడ్డిని బైక్‌లు అడ్డంపెట్టి దాడి చేశారన్నారు. అదే విధంగా గడివేముల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీనివాసులుకు చెందిన బంకును 15వ తేదీ ధ్వంసం చేశారని ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులపై పోరాడుతామని తెలిపారు. కొందరు టీడీపీ కార్యకర్తలు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పాణ్యం సీఐ నల్లప్పకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పినట్లు జెడ్పీటీసీ తెలిపారు.

సకాలంలో మందులు వాడితే కుష్టు నయం



పరీక్షలు చేస్తున్న డీఎస్‌పీఓ మల్లికార్జున

ఓర్వకల్లు: కుష్టు వ్యాధిని ముందస్తుగా గుర్తించి వైద్యుల సలహా మేరకు మందులు వాడితే నయం చేసుకోవచ్చని డీఎస్‌పీఓ మల్లికార్జున అన్నారు. సోమవారం వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ఓర్వకల్లు, హుసేనాపురం గ్రామాలను సందర్శించారు. జాతీయ కుష్టు నిర్మూలనా పక్షోత్సవాల్లో భాగంగా సచివాలయ ఆరోగ్య సిబ్బంది ఈ నెల 18 నుంచి ఆగష్టు 2వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే రిపోర్టులను పరిశీలించారు. అనంతరం కొంత మందికి కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నాయా?లేదా? అని పరిశీలించారు. డీపీఎంఓ ప్రకాష్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాశరావు పాల్గొన్నారు.

సంచార వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

- రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత



సిబ్బందితో మాట్లాడుతున్న హేమలత

ఓర్వకల్లు: రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో నిర్వహిస్తున్న 104, 108 వంటి సంచార వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత అన్నారు. సోమవారం మండలంలోని హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కేతవరం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. వాహనంలో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, మందులను పరిశీలించి సంతృప్తిం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ.. 104 వాహనం ద్వారా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులకు రక్తపోటు, షుగర్ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేయాలని తెలిపారు. ఇంటికే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఆవ్వాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. సామాజిక ఆరోగ్య అధికారి నీరజ, పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్, సచివాలయ ఏఎన్ఎం లలిత పాల్గొన్నారు.

ముగిసిన చదరంగం పోటీలు



విజేతలకు కప్పులు అందజేసిన ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ

కర్నూలు (టౌన్): రెండు రోజుల పాటు స్థానిక ఏపీజె అబ్దుల్ కలాం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్- 7, అండర్-9 బాలబాలికల చదరంగం పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి కప్పులు అందజేసి అభినందించారు. విజేతలుగా అండర్-7 బాలుర విభాగంలో షవాజ్ రాజ్, వేదేశ్, బాలికల విభాగంలో హన్విత, రిత్వి, అండర్-9 బాలుర విభాగంలో హేమనందన్ నాయక్, అభికేశవ్, బాలికల విభాగంలో కమతం వెంకట రిత్విక, అకాంక్షిత రెడ్డి నిలిచారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ రవి నాయక్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఓపీ ఇవ్వడంలో ఆలస్యం చేయొద్దు



ఆసుపత్రిలో పర్యటిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగులకు ఓపీ ఇవ్వడంలో ఆలస్యం చేయవద్దని సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. ఆయన సోమవారం ఆసుపత్రిలో పలు విభాగాలను తనిఖీ చేశారు. ఓపీ కౌంటర్ వద్ద రోగుల రద్దీని గమనించి త్వరగా ఓపీ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్జికల్ వార్డు వద్ద ఓపెన్ డ్రైన్లను మూసివేయాలన్నారు. ఎంఆర్ఐ కేంద్రం వద్ద కొత్త టైల్స్ వేయాలని సూచించారు. క్యాజువాలిటీలో ఒకే మంచంపై ఇద్దరు రోగులను పడుకోబెట్టడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులను కొత్త క్యాజువాలిటీలోకి తరలించాలని సీఎంఓకు చెప్పారు. ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ రామశివ నాయక్, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

శరవేగంగా బ్రిడ్జి పనులు



హంద్రీనదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి

కల్లూరు: చెన్నై నుంచి సూరత్‌కు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా కల్లూరు పరిధిలోని లక్ష్మీపురం, పందిపాడు గ్రామాల మధ్య హంద్రీనదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు జోరందుకున్నాయి.